

ఆరులేన్ల రహదారితో..
ఆరుగంటలే ప్రయాణం
• శరవేగంగా విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు
• పనులు పూర్తయితే తగ్గనున్న ప్రయాణ భారం
7

అసాంఘిక కార్యకలాపాలను అరికడతాం

• ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, వ్యభిచారం లాంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో అరికడతామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మొదటిసారిగా శుక్రవారం ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ పరిధిలో క్రైం రేటును పరిశీలించి సమస్యలపై పోలీసు అధికారులతో సమీక్షించామన్నారు. స్టేషన్ల వారీగా రివ్యూ చేశమన్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరులో జరుగబోయే దసరా ఉత్సవాలకు ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్నిరకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోమని ఆదేశించామన్నారు. లక్షలాదిగా వచ్చే భక్త సమూహానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణం అంతా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా అమ్మవారి తొట్టిమెరవణిలో ఎలాంటి తొక్కిసలాటలు జరుగకుండా, బాణాసంచా ప్రమాదాలు చోటుచేసుకోకుండా భద్రత పెంచుతామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ భావన, సీఐలు తిమ్మారెడ్డి, సదాశివయ్య, వేణుగోపాల్, నాగభూషణంతో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.

9 మందికి నోటీసులు జారీ

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం గ్రామంలోని శ్రీకొండా శింగరాయస్వామి భూములను ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకున్న వారిలో 9 మందికి నోటీసులు జారీ చేశామని దేవస్థానం ఈవో రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకొండా సింగరాయస్వామి భూముల్లో దాదాపు వంద మంది అక్రమంగా ఇళ్లను నిర్మించుకున్నారని అన్నారు. సర్వే నెంబరు 320లో 5.40 ఎకరాలు స్వామివారి మాన్యంలో అక్రమంగా నిర్మాణాలు ఉన్నాయన్నారు. గతంలో 10 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. శుక్రవారం తొమ్మిదిమందికి ఇచ్చామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు మొత్తం 19 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. ఇంకా 81 మందికి జడ్జిమెంటు రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం సీహెచ్ శ్రీనివాసులు, సుబ్బరత్నం, నాగమ్మ, వెంకటసుబ్బమ్మ, అనురాధ, భాగ్యమ్మ, భ్రమరాంబ, గురయ్య, ప్రసాద్‌లకు నోటీసులు జారీ చేశామని, వారు వారంలోపు వివరణ ఇవ్వాలని ఈవో తెలిపారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి

• ఐసీడీఎస్ పీడీ రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించనున్నామని ఐసీడీఎస్ పీడీ రమాదేవి పేర్కొన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం, నివారణ చర్యలపై ఐసీడీఎస్, టాటా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లోపు వయసున్న పిల్లల్లో పోషకాహార లోపం గుర్తించి పెరుగుదలను అంచనా వేసి పోషకాహార, ఆరోగ్యచికిత్స అందించి వారిని సాధారణ స్థాయికి తీసుకు వస్తామన్నారు. 10 కీలక అంశాల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా అంగన్వాడీ కేంద్రంలో అందరు పిల్లలకు ఎత్తు బరువు నమోదు చేసి పోషకాహార లోపంతో ఎదుగుదల లోపించిన వారిని గుర్తిస్తామన్నారు. వీరికి అదనంగా 2.5కిలోల బాలామృతం ఇస్తామని చెప్పారు. అదే విధంగా పిల్లలకు ఆకలి టెస్టు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ డాక్టర్ వీరభద్రుడు, అమరావతి, వరలక్ష్మి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు : జేడీ
7
సీజనల్ వ్యాధులపై
అప్రమత్తత అవసరం
• డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అన్నది నానుడి. ఇవి రెండూ మనిషి జీవితంలో అత్యంత కష్టమైన పనులంటారు. ఇంత కష్టమైన వాటిలో పేదలకు సొంతింటిని సాకారం చేసేందుకు సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఇప్పటికే సూపర్‌సిక్స్ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూరుస్తున్నారు. పింఛన్లు, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, ఉచిత బస్సు ఇతరత్రా పథకాలతో లబ్ధి పొందుతున్నారు. అవన్నీ తాత్కాలిక పథకాలు. ఇప్పుడు పేదలకు సొంత ఇళ్లు నిర్మించేందుకు బాబు సర్కారు అడుగులు వేస్తోంది.

పేదల గూడుకు బాబు భరోసా

• ఇంటి నిర్మాణానికి రూ.2.50లక్షల ఆర్థిక సాయం
• ఎస్సీ, బీసీలకు మరో రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు
• జిల్లాలో 2,067 మందికి వర్తింపు

(కడప-ఆంధ్రజ్యోతి): పట్టణ పేదలు చాలామంది బాడుగ ఇళ్లల్లో మగ్గుతున్నారు. అలాంటి వారికి సొంతింటి భాగ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా సంకల్పించింది. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోని కుటుంబాలకు ప్రభుత్వం భరోసా ఇవ్వనుంది. జగన్ హయాంలో సెంటు స్థలం, రూ.1.50లక్షలు ఇచ్చి పండుగ చేసుకోమని చెబితే.. ఆ నిధులు సరిపోక చాలా మంది ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణ వ్యయం డబుల్ చేసింది. ఎంతంటే.. ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇక ఈ స్కీంలో బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇవ్వనున్నారు. నిజంగా ఇది పేదలకు ఓ వరం.

జగన్ హయాంలో నాశనం

జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్రలో ప్రతి పేదవాడికి రూ.5లక్షలతో ఇల్లు నిర్మించి తాళాలను లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. జగన్ సీఎం అయ్యాక ఎన్నికల హామీ మేరకు రూ.5లక్షలు కాకుండా కేవలం ఇంటి నిర్మాణానికి రూ.1.50లక్షలు మాత్రమే ఇచ్చారు. జిల్లాకు సుమారు 90వేల ఇళ్లు కేటాయించినా జగన్ ఇచ్చే సొమ్ము సరిపోక చాలామంది ఇళ్లనిర్మాణం చేపట్టలేదు. కొందరు నిర్మాణం చేపట్టినా డబ్బులు సరిపోక మధ్యలోనే ఆపేశారు.

ఏ ఊరికి ఎన్ని ఇళ్లంటే..

కడప	936
బద్వేలు	169
మైదుకూరు	243
ప్రొద్దుటూరు	340
జమ్మలమడుగు	100
ఎర్రగుంట్ల	115
పులివెందుల	70
కమలాపురం	94

పీఎంఏవై 2.0 అమలు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 అమలులో భాగంగా జిల్లాకు పెద్దఎత్తున పక్కాగృహాలు కేటాయించారు. ప్రస్తుతానికి కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోని సొంత స్థలం ఉన్న పేదలకే ఇళ్లు కేటాయిస్తున్నారు. 2.0 కోసం జిల్లా వ్యాప్తంగా 18,259 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతానికి కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో మాత్రమే ఇళ్ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో 2,067 ఇళ్లను మంజూరు చేయనుంది. ఈ ఇంటి నిర్మాణాలకు మొత్తం వ్యయం రూ.2.50లక్షలు. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వనుంది. బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇవ్వనున్నారు. అయితే ఈ పథకానికి సొంత స్థలం ఉన్నవారే అర్హులు.

అర్హులందరికీ ఇళ్లు



- రాజారత్నం, పీడీ

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0లో భాగంగా కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ప్రస్తుతానికి సొంత స్థలం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇల్లు లేని పేదలు సొంత స్థలం డాక్యుమెంటు, ఇతర పత్రాలతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైతే ఇంటిని మంజూరు చేస్తాం.

ఉల్లి మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి

• కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పండించే ఉల్లి పంటను రై తులకు నష్టం వాటిల్లకుండా మార్కెటింగ్ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేకదృష్టి పెట్టిందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి ప్రభుత్వం చేపడుతున్న ఉల్లి కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలోని ఉల్లి ట్రేడర్స్‌తో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నష్టాల బాటలో ఉన్న ఉల్లి రైతులకు ట్రేడర్లు ఆర్థికంగా అండగా ఉండాలే తప్పా అధిక లాభం ఆశించడం తగదన్నారు. జిల్లాలో ఉల్లి నిల్వలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. చాలా ప్రాంతాల్లో ఉల్లి పంటకోత దశలోనే ఉందని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట దిగుబడిని ఎలా సంరక్షించుకోవాలి? ఒక్కసారిగా అధిక పంట మార్కెట్ యార్డులకు చేరితే దానిని ఎలా మార్కెటింగ్ చేయాలి? అనే అంశాలపై రైతులు, ట్రేడర్లతో కలెక్టర్ చర్చించారు. ఉల్లి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా నాణ్యతను పరిగణలోకి తీసుకొని కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, మార్క్‌ఫెడ్ అధికారి పరిమళజ్యోతి, మార్కెటింగ్ ఏడీ అజాద్ వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌పరం చేయొద్దు : వైసీపీ



పులివెందుల మెడికల్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు

పులివెందుల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయొద్దని వైసీపీ విద్యార్థి విభాగం పేర్కొంది. శుక్రవారం పులివెందుల మెడికల్ కళాశాల వద్ద విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థి విభాగానికి సంబంధించిన విద్యార్థులు మెడికల్ కళాశాలలోని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలోకి తీసుకోరాదన్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మెడికల్ కళాశాలలు వెళితే సామాన్యులకు వైద్యం భారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని చైతన్యరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్యరెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, కృష్ణమూర్తి, హాల్ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో భారీ వర్షం

• మురుగునీటి కాలువలో కొట్టుకొనిపోయి నలుగురు మృతి

రాయచోటి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా మురుగునీటిలో కొట్టుకుపోయి నలుగురు మృతి చెందారు. ఈ దుర్ఘటనలో 8 ఏళ్ల బాలిక మృతదేహం ఆచూకి తెలియలేదు.

శుక్రవారం సాయంత్రం 6.50 గంటల ప్రాంతంలో రాయచోటిలో ఒక్కసారిగా కుండపోత వర్షం మొద ఏకధాటిగా కురిసింది. వర్షం నీరు, మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహించాయి. ఆ సమయంలో స్థానిక కొత్తపేట రామాపురం నాలుగు కుళాయిల వద్ద ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో వెళుతున్న ఆటోలోకి నీళ్ల రావడంతో భయాందోళనకు గురైన పిల్లలు ఒక్కసారిగా కిందకు దిగేశారు. దీంతో యామిని (6) అనే బాలిక పక్కనే ఉన్న మురుగునీటి కాలువలో పడి కొట్టుకుపోయింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ నరసింహకుమార్‌తో పాటు మున్సిపాలిటీ, ఫైర్, వివిధ శాఖల అధికారులు అక్కడకు చేరుకున్నారు. రాత్రి 11.15 గంటలకు కూడా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక ఎస్ఎన్ కాలనీ గుండ్లకుంట రోడ్డు ప్రాంతంలో మున్ని (27), ఆమె కుమారుడు ఇలియాస్(6) ఇంటి ముందు మురుగునీటి కాలువమీద బండలపై నిలబడికుని ఉండగా ఒక్కసారిగా అవి కూలిపోవడంతో వీరిద్దరూ నీళ్లలో కొట్టుకుపోయారు. వీరిని రక్షించేందుకు ప్రయత్నించిన ఎదురింటికి చెందిన గణేష్(30) అనే వ్యక్తి కూడా మృతిచెందాడు. వీరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులకు నష్టపరిహారం కోసం జేసీ ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

24 ఎర్రచందనం
దుంగలు స్వాధీనం
• ఒకరి అరెస్టు
6

అరటి ధర పతనం

• ఆందోళన చెందుతున్న రైతులు



సాగులో ఉన్న అరటి తోట

లింగాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దిగుబడులు చేతికందే సమయంలో అరటి ధరల పతనం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. గత సంవత్సరం ఇదే సమయంలో టన్ను రూ.24వేలు పలికింది. ఈ సంవత్సరం నాణ్యతను బట్టి రూ.5 వేల నుంచి రూ.9వేల వరకు మాత్రమే వ్యాపారులు కొనుగోళ్లు చేస్తున్నారు. జూలై నెలాఖరు వరకు టన్ను రూ.15 వేల నుంచి రూ.19వేల వరకు పోయింది. ఆగస్టు నుంచి ధరలు పతనం మొదలయ్యాయి. ఇప్పుడు టన్ను రూ.5వేలకు పడిపోయింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి డిమాండ్ లేకపోవడం, ఇతర దేశాలకు ఎగుమతులు పరిమితంగా జరుగుతుండడం ధరల పతనానికి కారణం అని వ్యాపారులు అంటున్నారు. లింగాల మండల వ్యాప్తంగా అరటిపంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలలో ఎంతోమంది రైతులు అరటి సాగుచేసి అప్పుల ఊబినుంచి బయటపడగలిగారు. వాణిజ్య పంటలు సాగుచేసి అప్పుల్లో కూరుకుపోయిన రైతులు క్రమంగా ఉద్యానపంటల సాగుకు మొగ్గుచూపారు. కృష్ణాజలాలు రావడం సాగునీటి సమస్య తొలగిపోవడంతో అరటి విస్తీర్ణం పెరుగుతోంది. ఒక్క లింగాల మండలం మాత్రమే కాకుండా పులివెందుల నియోజకవర్గం అంతా అరటి సాగులో ఉంది. మూడు సంవత్సరాలుగా కొద్దిరోజులు మినహా గిట్టుబాటయ్యేలా ధరలు ఉండడంతో చాలా మంది రైతులు అరటిపంట సాగుకు మొగ్గు చూపారు. ప్రస్తుతం ఒక్క లింగాల మండలంలోనే 10వేల ఎకరాలలో అరటి సాగైంది. ఇలాంటి సమయంలో ధరలు పతనం కావడంతో అరటి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అరటికి గిట్టుబాటు ధర లభించేలా చేయాలని వారు కోరుతున్నారు.



మార్కెట్‌కు తరలిస్తున్న అరటి దిగుబడులు

జిల్లాకు స్మార్ట్ రేషన్ కార్డులు

• మండలాల వారీగా చేరవేత
• 30 లోగా లబ్ధిదారులకు పంపిణీ



కడప కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా, సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం అయింది. జిల్లాకు 5,73,675 స్మార్ట్ రేషన్ కార్డులు మండలాల వారీగా చేరవేత ప్రక్రియ ప్రారంభమైంది. శనివారంలోగా అన్ని మండలాల తహశీల్దారు కార్యాలయాలకు వీటిని చేరవేస్తామని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు. స్మార్ట్ రేషన్ కార్డులను మొదటి ఐదు రోజుల పాటు వృద్ధులకు, వికలాంగులకు సచివాలయాల ఉద్యోగులు, రెవెన్యూ వీఆర్వోలు, ఆర్ఐలు ఇంటి వద్దకెళ్లి అందజేయనున్నారు. మిగతా కార్డులను సచివాలయ సిబ్బంది గతంలో చేపట్టిన ఇంటింటి మ్యాపింగ్ ఆధారంగా అర్హులందరికీ అందజేస్తారు.

క్యూఆర్ కోడ్‌తో...

గతంలో రేషన్ కార్డు అంటే పేపరుతో తయారు చేసేవారు. ఇవి కొంతకాలానికి చిరిగి పోతుండటంతో కొంతమంది డూప్లికేట్ రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునేవారు. అలాంటి విధానానికి స్వస్తి పలుకుతూ చంద్రబాబు సర్కారు క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన ఏటీఎం సైజ్‌లో ఉండేలా స్మార్ట్ రేషన్ కార్డులకు రూపకల్పన చేసింది. ఈ నెల 1 వతేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వీటి పంపిణీకి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు జారీచేశారు. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు 5వ ఫేజ్‌లో ఈనెల 15 నాటికి చెన్నైలో ముద్రణ సంస్థ నుంచి స్మార్ట్ కార్డులు అందాల్సి ఉంది. కానీ జిల్లాల వారీగా సరఫరా చేయాల్సిన కాంట్రాక్ట్ పొందిన సంస్థ అన్నమయ్య, కడప జిల్లాలకు స్మార్ట్‌రేషన్ కార్డులను మండల తహశీల్దార్ల కార్యాలయాలకు చేరవేతను గురువారం ప్రారంభించింది. దీంతో శని లేదా ఆదివారం నాటికి అన్నిమండలాలకు పూర్తి స్థాయిలో ఇవి చేరనున్నాయి.

డీలర్లకు కొత్త ఈ-పోస్ యంత్రాలు

స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులు సకాలంలో వినియోగించుకునేలా జిల్లాలో 1,239 మంది డీలర్లకు కొత్త ఈ-పోస్ యంత్రాలను సివిల్ సప్లై అధికారులు పంపిణీ చేస్తున్నారు. నూతనంగా ఇస్తున్న స్మార్ట్‌కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్ పాత ఈపోస్ మిషన్లతో పనిచేయదు. అందువల్ల కొత్త ఈ-పోస్ మిషన్లను డీలర్లకు అందుబాటులోకి తెచ్చారు. వీటిని 5జీ నెట్‌వర్క్‌తో పనిచేసేలా రూపొందించారు. కొత్త ఈ-పోస్ యంత్రాల వల్ల క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం కానుండడంతో స్మార్ట్‌రేషన్ కార్డుదారుల పూర్తి వివరాలు వెంటనే డిస్‌ప్లే కానున్నాయి. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించకుండా సకాలంలో రేషన్ పొందే అవకాశాలున్నాయి. ఇకపోతే ఈ నెల 30 వరకు రేషన్ కార్డుల పంపిణీ తరువాత మిగిలిన కార్డులను డీలర్ల వద్ద ఉంచనున్నారు. అక్కడ అర్హులైన లబ్ధిదారులకు వాటిని అందజేస్తారని సివిల్ సప్లై అధికారులు తెలిపారు.

రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం.. పట్టు రైతుల పాలిట శాపంగా మారింది. ఒకప్పుడు పడమటి ప్రాంత మండలాల్లో భారీగా పట్టు సాగు చేసేవారు. కరోనా సమయంలో పట్టు ధరలు విపరీతంగా తగ్గుముఖం పట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టు రైతులను పట్టించుకోలేదు. దీంతో రైతన్నలు అప్పులపాలై అయోమయ స్థితిలో పడ్డారు. ఆ దెబ్బ నుంచి రైతులు ఇప్పటికీ కోలుకోలేకున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం పట్టు రైతులను ప్రోత్సహించడానికి కనీస సౌకర్యాలు, రాయితీలు కల్పించలేదు. దీంతో చాలామంది రైతులు పట్టు సాగును మానుకుని ఇతర పంటలవైపు మళ్లారు.

పట్టుదొరికేనా..?

- గత ప్రభుత్వ పాపం.. పట్టురైతుల పాలిట శాపం
- నేడు ధరలు పెరిగినా.. ఆసక్తి చూపని రైతన్నలు

కురబలకోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పడమటి ప్రాంత మండలాల్లో ప్రధాన జీవన వనరు వ్యవసాయమే. ఇక్కడి రైతులు టమోటా, వేరుశెనగ, ఉల్లి పంటలతో పాటు పట్టు పంట సాగు చేస్తారు. మిగతా పంటల మాదిరిగా కాకుండా పట్టు పంటకు నికర ఆదాయం దక్కుతుంది. దీంతో అన్ని సమయాల్లో లాభాలను ఆర్జించవచ్చు. అయితే కరోనా సమయంలో విపరీతంగా నష్టాలను చవిచూడడంతో చాలా మంది రైతులు పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపలేదు. అనంతరం పలుమార్లు పంటలకు ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రధానంగా వేసవిలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు లాభాలు ఆర్జించవచ్చునని ఆశించినా.. అలా జరగలేదు. ధరల్లేక నష్టపోయారు.

మార్కెట్ సౌకర్యం లేదు

వర్షాకాలం మినహా మిగిలిన అన్ని సమయాల్లో పంటను ఎక్కువగా సాగుచేస్తారు. షాకీ కేంద్రం నుంచి మట్టి పురుగులు తెచ్చి పంటను సాగు చేస్తారు. ఈ పంట చేతికి అందడానికి శీతాకాలంలో నెల రోజులు, వేసవిలో దాదాపుగా 25రోజులు పడుతుంది. కాగా కొన్ని సమయాల్లో పంట పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. అయినా కష్టపడి సాగుచేస్తున్నారు. అయితే ఇక్కడ మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో చాలామంది కర్ణాటకలోని చింతామణి, కోలార్, సిల్లగట్టు తదితర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు జరుపుతారు. దీంతో వీరికి ఖర్చు ఎక్కువగా వస్తోంది. మార్కెట్‌లో మొదటి రకం పట్టు గూళ్ల కిలో అప్పట్లో రూ.500 నుంచి రూ.600 వరకు, రెండో రకం రూ.400 నుంచి రూ.500 మాత్రమే పలికింది.

వైసీపీ హయాంలో అందని రాయితీ

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పట్టు రైతులను ప్రోత్సహించడానికి రాయితీలు, ప్రోత్సాహకాలు అమలు కాలేదు. గతంలో పట్టు రైతులను ప్రోత్సహించడానికి షెడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేసేవారు. ఇందులో కేంద్రప్రభుత్వం 50శాతం రాయితీ, రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీ, మిగిలిన 25శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. షెడ్డు నిర్మాణం పూర్తయిన వారం రోజుల్లో రాయితీ సొమ్ము జమ అయ్యేది. అయితే షెడ్డు నిర్మాణాలు చేపట్టిన కొంతమంది రైతులకు రెండు, మూడు ఏళ్ల అనంతరం రాయితీ చెల్లించారు. చాలా మంది రైతులకు ఇప్పటికీ రాయితీ నిధులు జమకాలేదు. 2019కి మునుపు బైవోల్టిన్ రకం పట్టు సాగుకు కిలోకు రూ.50 ప్రోత్సాహకాన్ని అందించేవారు. ఆ రాయితీని వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా ఆపేశారు. గతంలో ప్రతి మండలానికి రైతుల సమస్యలు తీర్చడానికి ఇన్‌స్పెక్టర్, టీఏలు ఉండేవారు. చాలామంది పదవీ విరమణ పొందడంతో 15మండలాలకు ఒక అధికారితో కాలం వెల్లదీశారు. ఇవి కూడా పట్టు సాగు తగ్గడానికి కారణాలు.

ధరలు పెరిగినా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టు ధరలు భారీగా పెరిగాయి. అయినా రైతులు పట్టును సాగు చేయడానికి ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌లో మొదటి రకం రూ.500 నుంచి రూ.600 వరకు, రెండో రకం రూ.400 నుంచి రూ.500 మాత్రమే పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో మొదటి రకం రూ.700 నుంచి రూ.750 వరకు, రెండో రకం రూ.600 నుంచి రూ.650 ఉంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తే ముందులాగా పట్టుసాగు పెరిగే అవకాశం ఉంది. అలాగే పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. లేదంటే జిల్లాలో పట్టుసాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



రైతులు సాగు చేసిన మల్బరీ పంట



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పట్టుగూళ్లు

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

27 ఏళ్లుగా పట్టును సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాను. మా ప్రాంతంలో దిగుబడి చేసిన పంటను కర్ణాటకాలోని సిల్లగట్టుకు తరలించి విక్రయిస్తాము. మాకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవంతో 130 కిలోమీటర్ల దూరం తరలించాల్సి వస్తోంది. దీంతో పంటను తరలించడానికి ఖర్చు ఎక్కువగా రావడంతో పాటు సమయం వృధా అవుతుంది. మాకు ఇక్కడే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. లోకల్ మార్కెట్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన పట్టుకు సకాలంలో నగదు చెల్లించాలి.



- గుణశేఖర్ రెడ్డి, రైతు, మట్లివారిపల్లె, కురబలకోట మండలం

ఆలయంలో చోరీ- నగదు అపహరణ

వాల్మీకిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని దుండగులు ఆలయంలో చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన గురువారం అర్ధరాత్రి వాల్మీకిపురం పట్టణ సమీపంలో చోటుచేసుకుంది. ఎండోమెంట్ ఈఓ అధికారుల ఫిర్యాదు మేరకు వివరాలిలా... పట్టణ సమీపంలోని నిమ్మనపల్లె మార్గంలో వెలసిన పురాతన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. ఆలయ ద్వారాల తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశిస్తూ తొలుత సీసీ కెమెరాల పరికరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఆలయంలోకి చొరబడి వెండి కిరీటం, హుండీ నగదు, సీసీ ఫుటేజి పరికరాలను అపహరించుకుపోయారు. కొత్తగా ప్రారంభమైన నాలుగు వరుసల రహదారి పక్కగా ఉన్న దేవాలయంలో ఈ చోరీ సంఘటన చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఉదయం విషయాన్ని గ్రహించిన ఈఓ మంజుల ఆలయానికి చేరుకుని పరిశీలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించిన అనంతరం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపి ఆలయ పరిసరాల్లో పరిశీలన చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



కుక్కదాడిలో గాయపడిన చిన్నారి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేసి చిన్నారిని గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, వలసపల్లె గ్రామం డ్రైవర్స్ కాలనీకి చెందిన మహేష్, గంగోత్రి దంపతుల కుమారుడు తరుణ్ శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధి కుక్కలు విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చాయి. కుటుంబ సభ్యులు వెంటనే గాయపడిన కుమారుడుని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు చికిత్స అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల ప్రభావం అధికంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఒకరి అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోడూరు అటవీ రేంజ్ పరిధిలోని కె.వి.బావి బీట్ వద్ద శుక్రవారం 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్‌వో శ్యాంసుందర్ తెలిపారు. కె.వి.బావి బీట్‌లో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న వారిపై దాడి చేసి తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అటవీశాఖ అధికారులు మోహన్‌కుమార్, జనార్దన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న డీఈ, తహసీల్దార్

రామసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అదనపు సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తహసీల్దార్ అజారుద్దీన్, విద్యుత్ డీఈ హరికుమార్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ మట్లవారిపల్లె సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని, నడింపల్లె రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉండగా వాటికింద వ్యవసాయ సర్వీసులు 13 వేలు ఉన్నాయన్నారు. వీటికి సరిపడా విద్యుత్ సరఫరా తక్కువగా ఉండడం వల్ల నూతన సబ్‌స్టేషన్ నిర్మించి వ్యవసాయానికి నిరంతరంగా 9గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఈ మస్తాన్, ఆర్ఐ వసీం, వీఆర్‌వో రెహమాన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలానికి చెందిన గ్రామ సర్వేయరు గుడి అశోక్‌కుమార్‌పై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ చిన్నమండెం-1 గ్రామ సర్వేయర్‌గా పనిచేస్తూ అదే మండలంలోని మల్లూరు గ్రామంలోని సర్వే నెం.1186, 1187లోని 6.39 ఎకరాలను విడగొట్టి మల్లూరు గ్రామం కొత్తపల్లె ఎస్సీ కుటుంబానికి చెందిన రైతుల పేరుతో నాలుగు భాగాలుగా సర్వే చేసి చిత్రపటాలు తయారు చేయడానికి రూ.60 వేలు డిమాండు చేశాడనే అభియోగాలతో ఆయనపై ఏసీబీ కేసు నమోదు చేసింది. డిమాండు మేరకు రూ.60 వేలు ఇస్తేగానీ సర్వే చేయనని అశోక్‌కుమార్ భీష్మించుకోవడంతో 2023 జనవరి 6న ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరుకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ కుటుంబంలోని నలుగురి పేరుతో ఆ భూమిని పట్టాలు ఇవ్వడానికి జిల్లా అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం కూడా లభించి జిల్లా కలెక్టరు పట్టాలు కూడా జారీ చేశారు. దీన్ని సబ్ డివిజన్ చేయాల్సిన దశలో అశోక్‌కుమార్ మెలిక పెట్టారు. చివరకు పని పూర్తయిందని రూ.60 వేలు తీసుకురావాలని సర్వేయర్ రైతులను పిలిపించుకున్నాడు. అయితే అంత మొత్తం ఇవ్వలేక మూడు రోజుల తరువాత వస్తామని రైతులు తిరిగి వెళ్లిపోయారు. సర్వేయర్ ఫోన్ కాల్స్‌కు సంబంధించిన రెండు మెమొరీ కార్డులను జతచేస్తూ రైతులు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు 2023 ఏప్రిల్ 4న కేసు నమోదు చేసి కడప ఏసీబీ ఇన్‌స్పెక్టరు ఇ.కృష్ణమోహన్ దర్యాప్తు చేపట్టారు. అప్పటి కొత్తపల్లె వీఆర్వో పి.నాగేశ్వరి, చిన్నమండెం తహసీల్దారు ఎం.శ్రీరాములు నాయక్, మరో తహసీల్దారు సి.నరసింహులు, డిప్యుటేషన్‌పై పనిచేసిన పీలేరు స్పెషల్ సర్వేయర్ కె.లోకేశ్వరిలను విచారించి మొత్తం వ్యవహారంపై వాంగ్మూలాలు నమోదు చేశారు. నలుగురు రైతుల సాక్ష్యాలను నమోదు చేసింది. దీనికి ప్రధాన ఆధారంగా లంచం డిమాండు చేస్తూ అశోక్‌కుమార్ ఫోను చేసిన 3 నిముషాల 24 సెకండ్ల నిడివిగల ఆడియో రికార్డింగ్‌ను ఏసీబీ జతచేసింది. సర్వేయర్ అశోక్‌కుమార్ లంచం డిమాండు చేయడానికున్న అన్ని అవకాశాలను ఏసీబీ పకడ్బందీగా విశదీకరించింది. మొత్తం మీద 2025 ఏప్రిల్ 30న ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీనిపై ప్రభుత్వం విచారణ చేయించి చర్యలు తీసుకునేందుకు నిర్ణయించిన దరిమిలా సర్వేయర్ అశోక్‌కుమార్‌కు 20 పేజీల చార్జి నోటీసును జారీ చేసింది. 10 రోజుల్లోగా వివరణ సమర్పించుకోవడం కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం నోటీసులు జారీ చేశారు.

ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో పరిశ్రమలకు ప్రోత్సాహం

- పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు నాగార్జున, శంకరప్ప

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పరిశ్రమల స్థాపనకు ,అభివృద్ధికి, ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి ఉపయోగపడుతుందని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారులు కె.నాగార్జున, శంకరప్ప తెలిపారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఎంఎస్ఎంఈ, జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన, వ్యాపారం సులభతరం చేయడానికి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అనే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి, సర్టిఫికెట్ అందజేశారు ఈ సందర్భంగా గ్లోబల్ సర్వీసెస్ ట్రస్టు చైర్మన్ పార్థసారధి మాట్లాడుతూ మంచి ప్రణాళికతో ముద్ర రుణాలు, పీఎంఈజీపీ లోన్లు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ఏటీఎం మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఆహార ఉత్పత్తిరంగంలో సబ్సిడీ లభిస్తుందని, ముద్ర పీఎంఈజీపీ ఫుడ్ ప్రాసెసింగ్ పథకాల ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రతి మహిళ ప్రయత్నించాలన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు మాట్లాడుతూ ఈ వర్క్‌షాపునకు హాజరైనవారిలో 60 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 50 మంది మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు పి.దామోదర్, ఎం.హరిబాబు, సీవీ సుబ్బమ్మ, పి.గోవిందమ్మ, యానిమేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశ్రమల ప్రోత్సాహక అధికారి

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

- పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీనివాస్‌నాయుడు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రబలకుండా తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ డీడీ శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం కోటకొండలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా 15 నుంచి అక్టోబరు 15 వరకు పశు వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తారన్నారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి నురగ రావడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలన్నారు. ఈ శిబిరంలో 186 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 210 పశువులకు బ్లూటాక్స్ పిచికారీ చేశామన్నారు. 27 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 56 దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చినట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ సుమిత్ర, మండల పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, కూటమి నాయకులు రెడ్డప్ప, రాజేష్, సిబ్బంది హేమాపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

ములకలచెరువు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర సూచించారు. సోంపల్లె పెద్దచెరువు నిండి కోనేటివారిపల్లె మీదుగా మొరవపోతుండంతో శుక్రవారం సాయంత్రం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు మొరవపోతున్న, వాగులు ఉన్న సమీప గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఇబ్బంది కలిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా రాత్రంతా కోనేటివారిపల్లెలో పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని ఉంచుతున్నామన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవన్నారు. కాగా మొరవ నీరు కోనేటివారిపల్లెలోని ఓ ఇంట్లోకి వస్తుడడంతో ఖాళీ చేయించి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లోకి పంపారు. ఆయన వెంట సీఐ వెంకటేశులు, ఎస్ఐ నరసింహుడు తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలి

- వైసీపీ శ్రేణుల ధర్నా

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని అలా కాకుండా ప్రైవేటుకు దారాదత్తం చేస్తే వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకూడూరు నుంచి వేలాదిగా వైసీపీ శ్రేణులు తరలిరావాలని ఇచ్చిన పిలుపునకు కేవలం 500 మాత్రమే ధర్నాకు రావడం విశేషం. రాజంపేట, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, తిరుపతి నుంచి భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారి అనుచరులు శుక్రవారం మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద నిర్మాణాలు నిలిచిపోయిన మెడికల్ కాలేజి భవనాల వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, పలు నియోజకవర్గాల నుంచి వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వాహనం సహా ఎర్రచందనం పట్టివేత



పట్టుబడిన వాహనంతో పాటు స్మగ్లర్‌ను అరెస్ట్ చూపుతున్న దృశ్యం

పీలేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అటవీ ప్రాంతం నుంచి తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫారెస్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. అత్యంత రహస్య సమాచారం మేరకు యల్లమంద - పీలేరు మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణాపై వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఏపీ29 ఏజీ0959 నెంబరు ఇన్నోవా అతివేగంగా వచ్చిందన్నారు. వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న ఐదు ఎర్రచందనం దుంగలు, తమిళనాడుకు చెందిన ఓ స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన స్మగ్లర్, వాహనం సహా ఎర్రచందనం పీలేరు ఫారెస్ట్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. ఎర్రచందనం, వాహనం విలువ రూ. 8.50 లక్షలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఈ దాడితో ఎఫ్ఆర్ఓ ఎస్.చంద్రశేఖర్, సెక్షన్ అధికారి ప్రకాష్‌కుమార్, బీట్ ఆఫీసర్లు కె.ప్రతాప్, పి.రెడ్డిప్రసాద్, పారెప్ప, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

విషద్రావణం తాగి చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాగేనీరు అనుకుని విషద్రావణం సేవించి చిన్నారి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సిరికల్చర్ కాలనీలో చోటు చేసుకున్న సంఘటనపై వివరాల్లోకెళితే... మదనపల్లె పట్టణం, సైదాపేటలో కాపురం ఉంటూ సిరికల్చర్ కాలనీలో పట్టు గూళ్ల రీలింగ్ సెంటర్‌లో కూలిగా షాదియా పనిచేస్తోంది. ఈమె భర్త కర్ణాటక రాష్ట్రం, బెంగళూరులో కూలీ పనులు చేసుకుంటుండడంతో రోజూ రెండేళ్ల కుమార్తె అలియాతో కలిసి పనికి వెళ్లేది. ఈ క్రమంలో తల్లిపని చేసుకుంటున్న సమయంలో అక్కడే ఆడుకుంటున్న చిన్నారి నీళ్లు అనుకుని రీలింగ్ సెంటర్‌లో ఉంచిన విషద్రావణం సేవించి స్పృహ కోల్పోయింది. గమనించిన రీలింగ్ సెంటర్ యాజమాని, తల్లి స్వర్ణకుమారి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో చిన్నారి అలియా మృతి చెందింది. ఈ మేరకు మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మన్...



మృతిచెందిన వాచ్‌మన్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, బసినికొండ జడ్పీ హైస్కూల్ వాచ్‌మన్ శ్రీనివాసులు (60) మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. శ్రీనివాసులు తన మనుమరాలు తరుణికను బైక్‌లో కూర్చోబెట్టుకుని స్కూల్ నుంచి ఇంటికి శుక్రవారం సాయంత్రం బయలుదేరాడు. పుంగనూరు బైపాస్ రోడ్డు, సాయిబాబా ఆలయం వద్ద పుంగనూరు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో శ్రీనివాసులు, మనుమరాలు గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు శ్రీనివాసులు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. చిన్నారిని మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అమరావతి, ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉందన్నారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హత్యకేసుగా పోలీసుల దర్యాప్తు



రీ పోస్టుమార్టం కోసం తవ్వుతున్న అధికారులు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో అదృశ్యమైన వ్యక్తి కేసును హత్య కేసుగా మదనపల్లె టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేసి శుక్రవారం రీ పోస్టు మార్టం నిర్వహించారు. ఈ మేరకు మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి వివరాల మేరకు మదనపల్లె పట్టణం, రామారావుకాలనీకి చెందిన జరిపిటి రామన్న (40) ఈ ఏడాది మార్చి 12న అదృశ్యయ్యాడు. తన సోదరుడు హనుమంతు ఫిర్యాదుతో ఈ ఏడాది జూన్ 21న మదనపల్లె రెండో పట్టణ పోలీసులు వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేశారు. మృతుడి భార్య రమణమ్మ, ఆమె సోదరుడు ఈశ్వర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి తమ్ముడు హనుమంతు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి నుంచి వారు ఇరువురు పరారీలో ఉండడంతో అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టడంతో రామన్న హత్య వెలుగులోకి వచ్చింది. వారి వివరాల మేరకు బి.కొత్తకోట మండలం, కస్తూర్బా పాఠశాల సమీపంలోని హంద్రీనీవా కాల్వ వద్ద పూడ్చిన రామన్న మృతదేహాన్ని వెలికితీసి అక్కడికక్కడే శవ పరీక్షలు నిర్వహించారు. సీఐ రాజారెడ్డి ఈ కేసును హత్య కేసుగా నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.

ఓటీపీ విధానం రద్దు చేయాలి

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంప్ వెండర్స్ నిరసన

పీలేరురూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ కోసం కొత్తగా తీసుకొచ్చిన ఓటీపీ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా లేఖరుల పెన్ డౌన్‌లో భాగంగా పీలేరులో నిరసన తెలిపారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశ పెట్టిన కొన్ని విధానాలతో తీవ్ర జాప్యం నెలకొంటోందని ఆరోపించారు. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాలతో దస్తావేజు తయారీ అనేది జటిలంగా మారుతోందన్నారు. అటు ప్రజలు ఇటు దస్తావేజుల లేఖరులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన విధానాల్లో మార్పు అవసరమని ప్రభుత్వానికి తెలియజేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పెన్ డౌన్ చేసి నిరసన తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చలపతి, స్టాంపుల మస్తాన్, మురళి, నరసింహారెడ్డి, ఖాదర్‌వల్లీ, రజాక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి రాజ్యాంగం చదవాలి

● వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి రాజ్యాంగం చదవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన భారత రాజ్యాంగం 75 - సాంకేతిక పదజాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కేవలం పొలిటికల్ సైన్స్ లేదా హ్యూమానిటీస్ విద్యార్థులకే పరిమితం కాదని, ప్రతి విద్యార్థి చదవాల్సిన గ్రంథమని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని సరళంగా అర్థమయ్యేలా సాంకేతిక పదజాలం రూపొందిస్తున్న కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ) కార్యక్రమాన్ని అభినందించారు. జామియా మిలియా ఇస్లామిక్ ప్రొఫెసర్ నవేద్ జమాల్ మాట్లాడుతూ రాజ్యాం గాన్ని విద్యార్థుల ముంగిటకు తీసుకెళ్లే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. సీఎస్‌టీటీ అసిస్టెంట్ డైరెక్టర్లు జెఎస్ రావత్, షజాద్ అహ్మద్ అన్సారీలు దేశవ్యాప్తంగా వచ్చిన రీసోర్స్ పర్సన్ల ప్రసంగాలు సమాచారపరంగా, ప్రేరణాత్మకంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అనంతరం సెమినార్ లోకల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.రవీంద్ర సతీష్‌బాబు మాట్లాడారు. చివరగా పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు వైస్ చాన్సలర్ సర్టిఫికెట్లు అందించారు.

ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధించాలి

జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు



యాప్ వినియోగంపై తర్ఫీదును పరిశీలిస్తున్న నిత్యానందరాజులు

వల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటరు నిత్యానందరాజులు అన్నారు. శుక్రవారం ఆయన వల్లూరు కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయాన్నే ప్రార్థనా సమయానికి చేరుకుని విద్యార్థులకు ప్రార్థనలు, గీతాలాపనలను ఆలపించే విధానాన్ని తెలిపారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. రాబోవు పదో తరగతి పరీక్షల్లో బాలికలు మంచి ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. ముఖ్యంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ హాస్టలులో మానిటరింగ్ యాప్‌ను ఎలా వినియోగించాలన్న అంశం పట్ల ప్రిన్సిపాల్‌కు తగిన సలహాలు ఇచ్చారు. జీసీడీవో డి.రూతు ఆరోగ్యమేరీ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ఎలా మెలగాలో తర్ఫీదునిచ్చారు. అలాగే హాస్టలు మానిటరంగ్ యాప్ టెక్నికల్ టీంసభ్యుడు శివనాగేంద్రప్రసాద్ అక్కడు న్న అకౌంటెంట్‌కు యాప్‌ను ఎలా వినియోగించాలనే దానిపై తర్ఫీదు నిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నసీమున్నీసా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు



మురుగు కుంటల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

ముద్దనూరు సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నాగరాజు వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధి కోడిగాండ్లపల్లెలో కొద్ది రోజులుగా విష జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఆ గ్రామంలో డీఎంహెచ్‌వో పర్యటించారు. గ్రామంలో విషజ్వరాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నివారించాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న మురికికుంటల్లో గంభూషియా చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, డాక్టర్లు కరిష్మా, శ్రీకాంత్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీపీపీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రిలే దీక్షలో పాల్గొన్న ఆర్టీపీపీ ఉద్యోగులు

ఎర్రగుంట్ల సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ ఉద్యోగుల, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. దీక్షలో వీరభద్రారెడ్డి, నారాయణ, సాంబశివారెడ్డి, రాము, రవిశేఖర్‌రెడ్డి మరి కొందరు కూర్చొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని, కాంట్రాక్టు కార్మికుల బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మహేశ్‌రెడ్డి, 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలరావు, కో చైర్మన్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరులేన్ల రహదారితో... ఆరుగంటలే ప్రయాణం!

● శరవేగంగా విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు

● పనులు పూర్తయితే తగ్గనున్న ప్రయాణ భారం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే విజయవాడ నుంచి బెంగళూరుకు కేవలం ఆరు గంటల్లోనే ప్రయాణికులు గమ్యాన్ని చేరుకోవచ్చు. ఇక కడప జిల్లా వాసులు బెంగళూరు, విజయవాడ వెళ్లేందుకు రవాణా మార్గం మరింత సులభతరమవుతుంది. బెంగళూరుకు మూడు గంటల్లోనే చేరుకోవచ్చు. వివరాల్లోకి వెళితే...



ఆరులేన్ల రహదారి నిర్మాణానికి గ్రావెల్‌ను చదను చేస్తున్న దృశ్యం

విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ (ఆరు లేన్ల) జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నాలుగో ప్యాకేజీ కింద మల్లేపల్లె - నెల్లూరు- కడప జిల్లా సరిహద్దు వరకు రూ.622 కోట్లు నిధులతో సుమారు 20 కి.మీ పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 14 ప్యాకేజీలుగా విభజించి పనులు జరుగుతున్నాయి. 2024 మార్చిలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. 2026 ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికే మల్లేపల్లె నుంచి కవలకుంట్ల రెవెన్యూ గ్రామాలైన సీతారాంపురం కనుమలగుండా రహదారి నిర్మాణం ఊపందుకుంది. ఇప్పటికే 30 శాతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ 20 కి.మీ పొడవునా ఆరు లేన్ల రహ దారికి 132 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే 70 పూర్త య్యాయి. 68 కల్వర్టులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. సగిలేరు వద్ద రెండు పెద్ద బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నాయి. నాలుగు చిన్న బ్రిడ్జిలు, ఎల్‌సీఈ ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. చిన్నాయపల్లె వద్ద ముడుమాల, వెంకటాపురం, బద్వేలు రోడ్డు లైను అండర్ ప్రాసెస్‌లో ఉన్నాయి. సిద్దవరం వద్ద ఒక ఎల్‌ఈపీ, చిన్నాయపల్లె వద్ద రెండు ఎల్‌ఈపీలు పనులు జరుగుతున్నాయి. టన్నెల్‌కు సంబంధించి 340 మీటర్లు అండర్ ప్రోగ్రెస్‌లో ఉంది. ఇంటర్ చేంజ్ గ్రీన్‌ఫీల్డ్ కోసం 1.50 కిలోమీటరుకు పెండింగులో ఉంది. దాదాపు 70 శాతం గ్రావెల్‌కు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తయితే ప్రకాశం- కడప - పులివెందుల మీదుగా నేరుగా బెంగళూరుకు చేరుకోవచ్చు.



యంత్రాలతో లెవలింగ్ చేస్తున్న దృశ్యం

ఇక ఈ పనులు పూర్తయితే చెన్నారెడ్డిపేట, మల్లేపల్లె, చాపాడు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు మీదుగా ఇంటర్ ఛేంజ్‌లు ఉంటాయి. దీంతో వాణిజ్య సమాచార, రవాణా కార్యకలా పాలు పెరుగుతాయి. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పచ్చదనం పెంపునకు మొక్కలు నాటడం, ప్రకృతి గండాలు తగ్గింపు, టన్నెల్స్ ద్వారా అడవిని పరిరక్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

గడువుకు ముందే పనులు పూర్తి

విజయవాడ - బెంగళూరు ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు అనుకున్న గడువు కంటే ముందుగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఆ దిశగా నిత్యం పనులు పర్యవేక్షిస్తున్నాం. 2026 ఫిబ్రవరికి ఈ పనులు పూర్తవ్వాలి. కానీ అంతకు ముందే పనులు పూర్తి చేస్తాం.

- నాయబ్‌రసూల్, గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు మేనేజరు

యూరియాపై ఆందోళన వద్దు.. జేడీ

ముద్దనూరు సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలకు యూరియా వాడుకోవాలని జేడీఏ చంద్రనాయక్ సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం జేడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పంటల వివరాలు, యూరియా పంపిణీ, ధరల వివరాలపై దుకాణదారులు ఇబ్బందు కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఎరువుల దుకాణాల్లో నిల్వ చేసిన ఎరువులు, పురుగుల మందులు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, అమ్మిన ప్రతి ఎరువు బస్తాకు బిల్లులు అందించాలని సూచించారు. అలాగే అగ్రిల్యాబ్, వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ముద్దనూరు: గోడౌన్‌లోని ఎరువుల బస్తాల స్టాక్‌ను పరిశీలిస్తున్న జేడీ చంద్రానాయక్

అధిక యూరియాతో భూసారం దెబ్బతింటుంది

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో యూరియా వాడడం వలన భూమి సారవంతం కోల్పోయి పంటల దిగుబడులు తగ్గిపోతాయని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులలు చంద్రానాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఇ.కొత్తపల్లె రైతు సేవా కేంద్రం లో ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యూరియాను పంటలకు ఒకేసారి వేయకుండా దశలవారీగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని ఓ ఎరువుల దుకాణాన్ని పరిశీలించి నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. అలాగే తొండూరు మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువులను పరిశీలించారు. ఎక్కువ ధరలకు యూరియాను విక్రయించకూడదన్నారు. మండల వ్యసాయాధికారి రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్యక్రమం

వల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమ వాస్య సందర్భంగా పుష్పగిరికొండపై ఉన్న రుద్రపాదం వద్ద ఈ నెల 21 ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త డి.వెంకట సుబ్బారెడ్డి, ఈవో శ్రీనివా సులు తెలిపారు. దక్షిణా కాశిగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో కొండపైన పంచమనదీ తీర్థం వద్ద సాక్షాత్తు పరమేశ్వరుడు స్వయంగా పాదం మోపిన రుద్రపాదం వద్ద పితృదేవతల ఆత్మ సంతృప్తి, స్వర్గలోక మోక్ష ప్రాప్తికోసం పితృదేవతలకు మహాల య అమా వాస్యరోజు పిండ ప్రదానం చేస్తే చాలా మంచిదన్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈసంవత్సరం కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన వారు పంచ టవల్, చెంబు, రెండు గ్లాసులు, ఉద్ధరణి లేదా పాత్ర, యజ్ఞోప వీతం (జంధ్యం) తదితర వస్తువులు తీసుకు రావాలన్నారు. పిండ ప్రదా నం కింద కూర్చుని చేయలేని వారి కోసం టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థానం వారు పసుపు, కుంకుమ, పూలు, బియ్యం పిండి, నువ్వులు ఇతర సామగ్రి అందజేస్తాన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నిబంధనలు పాటించని ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సీజ్

దువ్వూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో నిబంధనలు పాటించని నాలుగు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను శుక్రవారం వైద్య శాఖ సీజ్ చేసింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ ప్రైవేటు క్లీనిక్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చికిత్సలకు వచ్చే రోగులకు పరిమితికి మించి యాంటిబయాటిక్స్ వాడకం, సెలెన్ బాటిళ్లు ఎక్కించడంతోపాటు వాడిన వైద్యసామగ్రిని క్లినిక్‌లలో కనుగొన్నారు. సరైన అర్హతలు, అనుమతులు లేకుండా ఇలాంటి వైద్యం చేయడం రోగులకు ప్రమాదకరమని ఆయన వెల్లడించారు. స్థానికంగా ఉన్న శివప్రసాద్, శ్రీనివాసులు, షబ్బీర్, తాహీర్‌హుస్సేన్ అనే వ్యక్తులు నిర్వహిస్తున్న సదరు క్లినిక్‌లను సీజ్ చేశారు. స్థానికంగా చంద్ర క్లినిక్‌పై తనిఖీకి వెళ్లగా ఆస్పత్రి మూసివేసి ఫోన్ చేసినా అధికారులకు నిర్వాహకులు స్పందించలేదు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

కొండాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద నున్న సోలార్ కంపెనీలో జరిగిన దొంగతనం కేసులో శుక్రవారం పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. సోలార్ కంపెనీకి చెందిన రూ.24 లక్షలు విలువైన బ్యాటరీలు, వైరు దొంగతనం చేసినందుకు నలుగురిని అరెస్టు చేసినట్లు కొండాపురం సీఐ రాజా, తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు వారు తెలిపారు.

నంది విగ్రహం చోరీ




వినాయక విగ్రహం ఎదుట ఉన్న నంది విగ్రహం (ఫైల్), చోరీ తర్వాత ఏర్పడిన గొయ్యి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత సంగటిపల్లె లోని నరసింహస్వామి ఆలయంలో నంది విగ్రహం చోరీకి గురైంది. అతి పురాతన నరసింహస్వామి గుడి ఆవరణలో వినాయక స్వామి విగ్రహం ముందున్న నంది విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఈవో శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ చల్లనిదొర, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గుప్త నిధులకోసం నంది విగ్రహాన్ని దొంగలించి ఉంటారని భావిస్తున్నారు. కాగా, ఇప్పటికే పోలీసుల అదుపులో కొందరు ఉన్నట్లు సమాచారం.

లింగ వివక్షకు పాల్పడితే చర్యలు : ఆర్డీవో



మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వరకుమార్

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో లింగ వివక్షకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కడప రెవెన్యూ డివి జనల్ అధికారి జాన్ ఇర్విన్ హెచ్చరిం చారు. శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో డివిజన్ సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ, అడ్వజరీ సమావేశం డీఐఓ, పీసీఅండ్ పీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లింగ వివక్షత చట్ట రీత్యా నేర మన్నారు. కడప డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. లింగ వివక్షకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. అనుమానిత స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ ఆసుపత్రుల పరిధిలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగ న్వాడీ సెంటర్స్ పరిధిలోని గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు గర్భస్థ పూర్వ మరియు పిండ లింగనిర్ధారణ చట్టం, ఆడబిడ్డల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ రబ్బానీ మాట్లాడుతూ ఆడబిడ్డలు కలిగిన గర్భిణులు కాన్పు వరకు వారు ఎక్కడ డెలి వరీకి పోతున్నారు, స్కానింగ్ పరీక్షలు ఎక్కడ చేయించుకున్నారనే విషయాలను గమనించాలన్నారు. అంగన్వాడీ టీచర్ ద్వారా ఆడబిడ్డ ప్రాముఖ్యత, వివాహ వయస్సు, బాల్యవివాహాలు గురించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఏసీడీపీవో శోభారాణి, డాక్టర్ డేవిడ్ చక్రవర్తి, రేడియోలజిస్ట్, డాక్టర్ బాలకృష్ణ, తాలూకా సీఐ రెడ్డప్ప, డెమో భారతి, రమ ణమ్మ, డీహెచ్‌వో కుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు



రైఫిల్ షూటింగ్‌లో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 రైఫిల్‌షూటింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. శనివారం జార్జికారోనేషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఓపెన్‌సైట్, పీప్‌సైట్, పిస్టల్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, జార్జిక్లబ్ కార్యదర్శి మార్తల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, కోఆర్డినేటర్లు ప్రవీణ్‌కిరణ్, రాఘవేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ అసిస్టెంటు ప్రొఫెసర్‌పై కేసు

కడప క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): కడప రిమ్స్ దంత వైద్యశాల అసిస్టెంటు ప్రొఫెసరు చక్రపాణిపై కేసు నమోదు చేసినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. రిమ్స్ డెంటల్ కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేస్తున్న చక్రపాణి ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. కళాశాల ప్రిన్సి పాల్ జ్యోష్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

పశువైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయి. ఎంసెట్ ద్వారా ర్యాంకు సాధించిన విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ కౌన్సిలింగ్ నిర్వహించి కళాశాలలను కేటాయించింది. ఈ మేరకు విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాల అధ్యాపకులు తనిఖీ చేసి కళాశాలలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడు రోజులపాటు అడ్మిషన్లు కొనసాగుతాయని, మొదటిరోజు 22 మంది విద్యార్థులు కళాశాలలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి ప్రజ్ఞ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కడప క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని ఇటీవల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన షెల్కే నచికేత్ విశ్వనాథ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

లింగాల,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రజలందరూ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సమస్యకు పరిష్కారం లేదా..?

హైవే అధికారుల నిర్లక్ష్యం ● ప్రజలకు తప్పని తిప్పలు

చెన్నూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారులు ఎన్నోఏళ్లుగా చూపిస్తున్న నిర్లక్ష్యానికి ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. స్థానిక కొత్త రోడ్డులో వర్షం కురిసిందంటే దారి వెంబడి నీరు రోజుల కొద్దీ నిలబడడం, ప్రజలు రోడ్డు దాటి పక్కకు రావాలంటే ఆ నీటిలో అడుగు పెట్టి బురదలో జారి పడడం మామూలైంది. నీరు వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎన్నోమార్లు చెప్పినా వారి తీరు మాత్రం మారడంలేదు. దీంతో ప్రజలకు తిప్పలు తప్పడలేదు. రెండురోజులుగా కురిసిన వర్షాలకు స్థానిక కొత్తరోడ్డులో సుమారు 60, 70 మీటర్ల పొడవునా రోడ్డు అంచున అడుగు లోతుకు పైగా నీరు 10 అడుగుల వెడల్పుతో పూర్తిగా నిలబడింది. ఆటోలు, బస్సుల కోసం వచ్చేవారు బురదనీటిలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా వారి తీరులో మార్పురాక ప్రయా ణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు నీరు వెళ్లేందుకు సరైన దారి ఏర్పాటు చేస్తారో... లేదా ప్రజలను మీ తిప్పలు మీరు పడండని చెబుతారో చూడాల్సిందే.



చెన్నూరు కొత్తరోడ్డు వద్ద హైవే పొడవునా నిలిచిన వర్షం నీరు

ఏమారితే.. 'గుంత' కే మరి..!



సుబ్బిరెడ్డి కళాశాల సమీపంలో రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏమాత్రం ఏమరపాటుతో ఆదమరిచావో గుంతలో పడాల్సిందే. కడపనగరం బైపాస్ సుబ్బిరెడ్డి కళాశాల సమీపంలో గల రోడ్డు మధ్యలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గుంత ఏర్పడింది. గుంతలో నీరు చేరడంతో ప్రమాదాలకు స్థానంగా మారింది. గురువారం ఇదే రహదారిలో గుంతను దాటుతూ నలుగురు ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. అయితే చిన్న,చిన్న దెబ్బలతో వారు బయటపడ్డారు. ఈ గుంతను త్వరగా పూడ్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

అధ్వానం... వెంకటసాయినగర్ రోడ్డు



కడప నగరం ఓల్డ్ బైపాస్ సుబ్బిరెడ్డి కళాశాల సమీపంలో గల వెంకటసాయి నగర్ రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. వర్షాలకు రోడ్డంతా జలమయమైంది. ఈ రోడ్‌లో వెళ్లాలంటేనే ద్విచక్ర వాహనాలు, పాదచారులు భయపడుతున్నారు. అసలే మట్టిరోడ్డు దీంతో పాటు వర్షపు నీరునిలవడంతో బురదగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పులివెందులలో జగన్ అభివృద్ధి చేసింది శూన్యం : టీడీపీ



అసంపూర్తిగా ఉన్న సిటీ సెంట్రమ్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పులివెందుల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగన్ సీఎంగా ఉన్న సమయంలో పులివెందులకు చేసింది శూన్యమని టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పులివెందులలోని పాత బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న సిటీ సెంట్రమ్‌ను పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వెళ్లడం లేదన్నారు. రాష్ట్రంలో అందరు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పులివెందులకు నిధులు కుమ్మరించారని, అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని అనుకుంటున్నారన్నారు. కానీ ఇక్కడచేసింది శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఉప మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, టీడీపీనాయకులు తూగుట్ల సిద్దారెడ్డి, గుణకనపల్లె అమర్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ సెంట్రమ్ నిర్మాణాలు పరిశీలన

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని సిటీ సెంట్రమ్ నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకుంటామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ స్థలంలో ఆగిపోయిన సిటి సెంట్రమ్‌ను బీజేపీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, వాజ్‌పేయి పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ భవన సముదాయం ఇప్పటికీ అసంపూర్తిగానే ఉందన్నారు. ఈ భవనం గురించి కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు బాలగంగిరెడ్డి,అనిల్‌కుమార్, తరుణ్, అయ్, టోపీబాష పాల్గొన్నారు.

జాతిరత్నాలుగా విద్యార్థులు ఎదగాలి



మాట్లాడుతున్న పసుపులేటి శంకర్

కడప మారుతీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ విద్యనభ్యసించి భవిష్యత్ తరానికి జాతిరత్నాలుగా ఎదగాలని ఒంటిమిట్ట శ్రీపోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ సూచించారు. హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం కడప ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ సమావేశానికి పసుపులేటి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ ప్రసన్నకుమార్, ఉమ్మడి కడప, అన్నమయ్య జిల్లాలచైర్మన్ డేవిడ్ కళ్యాణ్‌రాజ్, రాజంపేట అన్నమాచార్య పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సమతానాయుడు, కడప ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీంద్రనాధ్ ,విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం పసుపులేటి శంకర్‌ను ఘనంగా సత్కరించారు.

22న చలో కలెక్టరేట్

సీకేదిన్నె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె సమస్యలపై ఈనెల 22న ఛలో కలెక్టరేట్ ఆందోళన నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామమోహన్ తెలిపారు. చెర్లోపల్లెలో శుక్రవారం పర్యటించి అక్కడ ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, బాలసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల్లో గుర్తింపుకోసమే ఆరాటం'

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో గుర్తింపుకోసమే టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి ఆరాటపడుతున్నారని వైసీపీనాయకులు విమర్శించారు. గత టీడీపీ హయాంలో టిడ్కో గృహాల కోసం సేకరించిన భూమిని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ పరిశీలించారు. కేవలం ఉనికి కోసమే లేనిపోని ఆరోపణలు చేయడంమానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైసీపీనాయకులు హాల్‌గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీలకు 42రోజుల సమ్మెకాలపు హామీలు, మినిట్స్ జీఓలు అమలు చేసి కనీసవేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీజనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సుజాతమ్మ, విజయభవాణి తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించి శుభ్రం చేయండి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగించి శుభ్రంచేయాలని మున్సిపల్ హెల్త్ అధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలో 9, 10 డివిజన్లను పరిశీలించిన ఆయన కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తియాప్

కడప క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు యంత్రాంగం మహిళలు, బాలికల భద్రత కోసం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. పాఠశాలలు, కళాశాల ల్లో శక్తి యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం నగరంలోని ఐటీఐ సర్కిల్‌లోని సాయిబాబా వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌లో ఉంటున్న మహిళలకు ఎస్‌ఐ శాంతమ్మ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తియాప్ ఎలా డౌన్‌లోడ్ చేయాలి, ఎలా ఉపయోగించాలన్న విషయాలపై వివరించారు. అలాగే వారి మొబైల్స్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

'బద్వేలు మున్సిపల్ కమిషనరుపై చర్యలు తీసుకోవాలి'

కడప మారుతీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బద్వేలు ప్రజలను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న సంబంధిత మున్సిపల్ కమిషనరుపై కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని జీఆర్ డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కారు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బద్వేలులో కొంతమంది రెవెన్యూ - మున్సిపల్ అధికారుల వివక్షతకు వ్యతిరేకంగా, బడుగు బలహీన వర్గాల ఆస్తుల రక్షణ కోసం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల పార్టీల నాయకులు అవ్వారు మల్లికార్జున, శ్రీనివాసులు, జేవీ రమణ, సంగటిమనోహర్, కైపు రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాలుగా ఆర్టీసీ కడప రీజియన్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఎస్‌ఎంయూఏ కడప డిపో అధ్యక్షుడు నగినాల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా శుక్రవారం స్థానిక గ్యారేజీ వద్ద ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాసు, లక్ష్మయ్య, పద్మావతి, హరిప్రసాద్, కొండయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

వల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన వల్లూరులోని ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి జె.మురళీక్రిష్ణ (ఎఫ్‌ఆర్‌వో) శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న స్టాకు రిజిస్టరు, బిల్లు బుక్కులు తనిఖీ చేశారు. రైతు తీసుకున్న ప్రతి ఎరువుకు రశీదు తప్పక ఇవ్వాలని సూచించారు. అలాగే గోడౌన్లలో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులు కావాల్సిన ఎరువులను రైతు సేవాకేంద్రాల వద్ద తీసుకుని వెళ్లవచ్చని సూచించారు. వీరి వెంట ఏవో ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

కమలాపురంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కమలాపురం రైల్వేస్టేషనులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ సమన్వయకర్త మీగడ అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కమలాపురం రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీజిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల శివారెడ్డి, డీసీసీ మాజీ ప్రధానకార్యదర్శి సుధాకర్, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, సురేంద్రరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కేంద్రాలలో మద్దతు ధర రూ.1200 ఉల్లి కొనుగోలు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంగా సురేష్, సీపీఐ కమలాపురం నియోజకవర్గ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, రైతులుపాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు అన్ని పార్టీలు వ్యతిరేకం'



మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నా చంద్రబాబు మాత్రం నా దారి నాదే అన్నట్లు ముందుకెళుతున్నారని వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శుక్రవారం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కడప క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నమయ్యసర్కిల్ వద్ద మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ ఆధ్వర్యంలో శుక్రవారం రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జావీద్ మాట్లాడుతూ స్కూళ్లకు దసరా సెలవుల నేపథ్యంలో ఇంటిలోని ద్విచక్ర వాహనాలు నడిపే ప్రయత్నం చేయకూడదని సూచించారు. అలాగే విద్యార్థులకు సూచనలు సలహాలు అందించారు.కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సుధాకర్, విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల తీవ్రతను గుర్తించి అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల తీవ్రతను గుర్తించి అప్రమత్తంగా ఉండాలని లెప్రసీ, టీబీ సూపర్‌వైజర్లు సుబ్బారెడ్డి భాగ్యలక్ష్మి, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య విద్యార్థినిలకు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆరోగ్యమే మహాభాగ్యం, ఇంటిగుట్టు వ్యాధి రట్టు అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్స్ డాక్టర్ యు.శ్రీనిత, ఎన్.శ్రీనివాసరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నవంబరు 2న బలిజల కార్తీక మాస వన భోజనం

కడప కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా వచ్చే నవంబరు 2న కడపలో పెద్దఎత్తున తలపెట్టిన కార్తీక వన భోజన కార్యక్రమం విజయవంతం చేయాలని బలిజ సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బలిజసంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు.ఈ కార్యక్ర మంలో బలిజ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు అమరప్ప, జిల్లా అధ్యక్షు డు సగినాల శ్రీనివాసులు, రెడ్డయ్య, మస్తాన్‌రావు. కొండయ్య పాల్గొన్నారు.

వంకలో పడి గేదె మృతి

చెన్నూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామనపల్లె - చెన్నూరు మధ్య గల ఉప్పువంకలో పాడిగేదె పడి మృతి చెందింది. రామనపల్లెకు చెందిన జంగిటి ఆదిలక్షుమ్మ పాడిపశువులను మేత కోసం బయటకి తోలుకుని వెళుతుండగా వంక కాజ్‌వేపై వెళుతూ నీటిలో కొట్టుకుపోయాయి. అయితే అప్పటికి పాడిగేదె కనిపించకుండా మధ్యాహ్నానికి బయటపడింది అప్పటికే మృతి చెందడంతో ఆదిలక్షుమ్మ తీవ్ర ఆవేదనకు గురైంది. కాగా చనిపోయిన గేదెను పశువైద్యాధికారి ఎర్రపురెడ్డి పరిశీలించారు.

టమోటా లారీబోల్తా : తప్పిన ప్రమాదం

సీకేదిన్నె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి రోడ్డు నుంచి కడపకు వస్తున్న టమోటా లారీ శుక్రవారం గువ్వలచెరువు ఘాట్ మొదటి మలుపు వద్ద అదుపు తప్పి పడిపోవడంతో ప్రమాదం జరిగింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. టమోటాలు కిందపడిపోయాయి. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలుగకపోవడంతో యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి.

'ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులను నియమించాలి'

వేంపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని వృషభాచలేశ్వరస్వామి అనుబంధ ఆలయాల్లో నాయీ బ్రాహ్మణులను నియమించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తిరుపతి లోని దేవదాయ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కార్యాలయంలో పర్యవేక్షణ అధికారి మల్లికార్జునరెడ్డికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఆలయాల్లో పూజా కార్యక్రమాలు, భాజాభజంత్రీలు తప్పనిసరిగా ఉండాలని కోరారు. అలాగే ఎద్దుల కొండపై గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ప్రాకారం, తూర్పు, పడమర రాజగోపురం పనులు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రవియాదవ్,రాజారెడ్డి, గణేష్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీనీ పంటలను పరిశీలించిన ఉద్యాన అధికారులు



వీరపునాయునిపల్లె,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో సాగులో ఉన్న చీనీ పంటల ను గుంటూరు ఉద్యాన సంయుక్త సంచాలకుడు డాక్టర్ దేవమునిరెడ్డి, చీనీ నిమ్మ పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. శుక్రవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె, లింగాల, ఉరుటూరు, పాయసంపల్లె గ్రామాలలో చీనీ చెట్లను పరిశీలించిన అనంతరం రైతులుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మంగు నివారణకు మందులను సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఉద్యాన శాఖ అధికారి రెడ్డయ్య రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

41 మంది జేఎన్టీయూ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న 41 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల యూ స్పైడర్స్ అనే కంపెనీ ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఇందులో 41 మందిని ఆ కంపెనీ ఎంపిక చేసుకుందన్నారు. సీఎస్ఈ విభాగం నుంచి 21, ఈసీఈ విభాగం నుంచి 12, సివిల్ విభాగం నుంచి 5, ఈఈఈ విభాగం నుంచి ముగ్గురు ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కె.శేషమహేశ్వరమ్మ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.



యూ స్పైడర్స్‌కి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తదితరులు

అమ్మవారిశాలను సందర్శించిన ఎస్పీ నచికేత్



అమ్మవారిశాలలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎస్పీ షెల్కే నచికేత్

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షెల్కే నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం రాత్రి అమ్మవారిశాలను సందర్శించారు. ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్ల గురించి ఆర్యవైశ్య సభ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించరు.. కష్టాలు తీర్చరు

- పొన్నతోట ఎస్సీ కాలనీవాసుల ఆక్రందన

జమ్మలమడుగు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మించరు.. కనీస వసతులు కల్పించరు. కష్టాలే మాతోడు అంటూ జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట ఎస్సీకాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని ప్రధాన రోడ్డు పక్కన ఆర్‌సీఎం చర్చి ఎదురుగా దక్షిణ భాగంవైపు మట్టి రోడ్డు ముళ్ల పొదలతో కప్పబడి విషపురుగులకు నిలయంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 2014లో అనుబంధ పత్రాలు అధికారులు ఇవ్వడంతో అప్పట్లో ఇందిరమ్మ గృహాల పేరుతో ఇంటి నిర్మాణాలు జరిగాయన్నారు. 1/87 ఇంటి వద్ద నుంచి ఉత్తర, దక్షిణ భాగంలో రోడ్డు లేదని సిమెంటు రోడ్డు నిర్మించాలని ఎన్నికల సమయంలో నాయకులు వచ్చినప్పుడు అడిగినా అప్పట్లో సిమెంటు రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చి ఇంత వరకు పట్టించుకోలేదన్నారు.2014 నుంచి వసతులు లేక మట్టి రోడ్డులోనే ముళ్లపొదల్లో జీవనం కొనసాగిస్తున్నామని వాపోయారు. అంతేకాక చర్చి ఎదురుగా విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసినా ఇళ్లకు కరెంటు సరఫరా లేదన్నారు. చాలా దూరం నుంచి ప్రధాన విద్యుత్ లైన్ల నుంచి కట్టెలపై తీగలు లాగి ఏదోలా జీవనం నెట్టుకొస్తున్నామని వాపోయారు. ఇప్పటికి మంచినీటి సరఫరా లేదని పొన్నతోట గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీకి అధికారులు వివక్షత చూపుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ నివాసాలకు పక్కనే సచివాలయం ఉన్నా ఏ ఒక్క అధికారి సమస్యలను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి ఎస్సీ కాలనీకి సిమెంటు రోడ్డు ఏర్పాటుతోపాటు కాలనీలో కనీస వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు. మరి అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.



కంపచెట్లతో కప్పబడిపోయిన మట్టిరోడ్డు

ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల మార్కెట్ కమిటీల నియామకం

కలికిరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పొద్దుటూరు మార్కెట్ కమిటీకి అధ్యక్షుడుగా రామిరెడ్డిపల్లె నాగరాజును, ఎర్రగుంట్ల కమిటీ చైర్‌పర్సన్‌గా వడ్డె సురేఖను నియమించారు. ప్రొద్దుటూరు కమిటీ గౌరవాధ్యక్షుడుగా ఎమ్మెల్యే ఎస్.వరదరాజులు రెడ్డి, ఉపాధ్యక్షుడుడుగా పట్నం లక్ష్మణ్‌కుమార్, సభ్యులుగా గొర్ల నరసింహారావు, మంచి నాగేంద్రమ్మ, యన్నం దిలీప్‌కుమార్, వేల్పుల పద్మలత, దాదాసాహెబ్‌గారి మహబూబ్ షరీఫ్, ఇంటి రెడ్డెమ్మ, వనం రమాదేవి, ముత్యాల పద్మజ, నక్కా రాణి, కొంకి సుమలత, వెంకటప్పగారి సుధాకర్, బొగ్గరపు వెంకటేశ్వర్లు, మార్తాల రాధ, చెన్నమరాజుపల్లె సింగిల్ విండో అధ్యక్షుడు, ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్‌లతోపాటు ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ ఏడీఏ, జిల్లా మార్కెటింగ్ అధికారిని నియమించారు. ఎర్రగుంట్ల ఏఎంసీకి గౌరవాధ్యక్షుడుగా జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, అధ్యక్షుడుగా రామిరెడ్డిపల్లె నాగరాజు, ఉపాధ్యక్షుడుగా సింగిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, సభ్యులుగా పగడాల సుమ, నామచెరువు సత్యం, చిట్టిబోయన ఓబులమ్మ, గొర్ల చిన్న ఓబులేశు, శూలం గంగాదేవి, ఉలసల గంగాదేవి, చామల పద్మజ, లింగుట్ల సూర్యప్రకాష్ నాయుడు, బక్కిరెడ్డి వెంకట సౌభాగ్య, తుమ్మలూరు రంగారెడ్డి, షేక్ రేష్మ, కొట్టపు ఈశ్వరమ్మ, కనాల ప్రియాంక, సున్నపురాళ్ళపల్లె సింగిల్ విండో అధ్యక్షుడు, ఎర్రగుంట్ల నగర పంచాయతీ అధ్యక్షుడు, ఎర్రగుంట్ల పశు సంవర్ధక ఏడీ, జిల్లా మార్కెటింగ్ అధికారిని సభ్యులుగా నియమిస్తూ వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కళాకారులను ఆదరించాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళలు అంతరించిపోకుండా ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహించాలని చెక్కభజన కళల జానపద రాష్ట్ర కన్వీనరు కందుల రవికుమార్, పోరుమామిళ్ల కళాకారుల నాయకులు చిత్తారి యల్లయ్య, ప్రసాద్, గురయ్య, సుధాకర్, రమణయ్యలు కోరారు. వారు శుక్రవారం ఎంపీడీవో ఉపేంద్రరెడ్డికి వినతిపత్రం అందించారు. కళారూపాలు అంతరించిపోకుండా గ్రామీణ కళలను ప్రోత్సహించాలని వారు కోరారు.

మున్సిపల్ కమిషనరుపై చర్యలు తీసుకోండి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బద్వేలు ప్రజలను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్న మున్సిపల్ కమిషనరుపై కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని జీఆర్ డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కారు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బద్వేలులో కొంతమంది రెవెన్యూ - మున్సిపల్ అధికారుల వివక్షతకు వ్యతిరేకంగా , బడుగు బలహీన వర్గాల ఆస్తుల రక్షణ కోసం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కడప ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఐదు సంవత్సరాలపాటు విధులు నిర్వహి స్తూ దాదాపు ఏడువేల ఇళ్లకు ఆ మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణాలు సాగించారన్నారు. అలాంటి వ్యక్తిని ప్రస్తుతం బద్వేలు మున్సిపల్ కమిషనరుగా ప్రభుత్వం ఎలా నియమిం చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అవ్వారు మల్లికార్జున, శ్రీనివాసులు, జేవీ రమణ, సంగటి మనోహర్, రామాంజనేయులు పలువురు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అవినీతిపై విచారణ జరిపించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ఏవో ఇక్బాల్‌బాషకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జమ్మలమడుగు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద కుళాయి కనెక్షన్ల మంజూరు, వాటి అమలు చేసే విధానంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, సంతోష్, నాగసురేష్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయండి

రాజుపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని డివిజనల్ అధికారి రామాంజనేయులు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సభాభవనంలో తాగునీరు, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ అధికారి మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షాకిర్‌అలీకాన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ఖాజీపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బస్టాండు కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వంశీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో దుకాణాదారులకు ట్రాఫిక్‌పై అవగాహనకల్పించారు. ప్రజలు, దుకాణాదారులు సహకరిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, దుకాణాదారులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో అర్బన్ సీఐ నరేష్‌బాబు ట్రాఫిక్ పర్యవేక్షించారు. అందులో భాగంగా ద్విచక్ర వాహనదారులను లైసెన్సు, రికార్డులు, పరిశీలించారు. కార్యక్రమంలో అర్బన్ పోలీసు స్టేషన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నరాత్రుల మహోత్సవా ఆహ్వాన పత్రికలను నూతన అధ్యక్షుడు అయ్యపు వెంకటసురేశ్‌బాబు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటసురేశ్ మాట్లాడుతూ 22 నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమై అక్టోబరు 3తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ దసరా మహోత్సవాలలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకే స్వస్థనారీ అభియాన్

అట్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):మహిళల ఆరోగ్య సంరక్షణ కోసమే స్వస్థ నారీ సశక్తి అభియాన్ పథకమని మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ పేర్కొన్నారు. శుక్రవారం అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో స్వస్థనారీ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ ప్రారంభించి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్ప మల్లికార్జునరెడ్డి, స్థానిక వైద్యాధికారి అమితాబేగం, సొసైటీ డైరెక్టరు రాధాక్రిష్ణరెడ్డి, అమర్‌నాథరెడ్డి, బీజేపీ నాయకులు ఆంజనేయులు అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ, పోలీసు సిబ్బంది, విలేజీ క్లినిక్ సెంటర్ల సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వస్థనారీ సశక్తి అభియాన్ ప్రారంభిస్తున్న విజయమ్మ

మహిళలకు సమతుల్య పోషకాహారం అవసరం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సమతుల్య పోషకాహారం అవసరమని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. శనివారం గోపవరంలో మహిళలు, విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వస్థనారీ, శక్తివంత కుటుంబం అబియాన్‌లో భాగంగా మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఇందిర, డాక్టర్ త్రివేణిలు మాట్లాడుతూ నెలసరి సమయంలో మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా నెలసరి సమస్యలపై మహిళలకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్‌లను ఉచితంగా అందజేశారు.



మహిళలకు శానిటరీ కిట్లు అందజేస్తున్న దృశ్యం

ఖాజీపేటలో: గర్భవతులు, బాలింతలు పోషకాహారాలు తీసుకోవాలని వైద్యాధికారి ఇలియారాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కూనవారిపల్లె విలేజ్ హెల్త్ కేంద్రంలో స్వస్థ నారీ, స్వశక్తి పరివార్ అబియాన్ కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, అంగన్వాడీ వర్కర్లు వెంకటసుబ్బమ్మ, సుబ్బమ్మ, ఆశా కార్యకర్తలు ఉమామహేశ్వరి, మామిళ్ళ క్రిష్ణారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడీలో అందించే వాటిని వివరిస్తున్న డాక్టర్ ఇలియారాణి

విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం తగదు

బద్వేలు/పోరుమామిళ్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగ , ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణబేరి రాష్ట్రవ్యాప్త ప్రచార జాతాలో భాగంగా పట్టణంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. యూటిఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జయచంద్రారెడ్డిలు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లిస్తామని హామి ఇచ్చి కూటమి ప్రభుత్వం కేవలం 7500 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. తమ న్యాయమైన సమస్యల కోసం ఈ నెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధా కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్ పాలెం మహేష్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిన్ని, తదితరులు పాల్గొన్నారు. కాగా ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ చేపట్టిన రణభేరి ప్రచార జాత శుక్రవారం పోరుమామిళ్ల చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ సర్కిల్ వద్ద బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి భైరవ ప్రసాద్, ఇబ్రహీం, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షురాలు సుజాతరాణి, జిల్లా కార్యదర్శులు చెన్నయ్య, బాలజోజి, రవీంద్రుడు, రమణ, పోరుమామిళ్ల, కలసపాడు, కాశనాయన మండలాల నేతలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

సంక్షేమ వసతి గృహాల్లో వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు వైద్య, ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. శుక్రవారం కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారుల బృందం ఆధ్వర్యంలో వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ సీజనల్ వ్యాధులపట్ల విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, సంక్షేమ వసతి గృహ అధికారులు రామక్రిష్ణారెడ్డి, బ్రహ్మం, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్‌వో నాగలత పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పోలీసులకు సన్మానం



కలసపాడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కలసపాడు పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లుగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్లను శుక్రవారం పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు సన్మానించారు. హెడ్‌కానిస్టేబుల్ రామగోవిందుతో పాటు కానిస్టేబుళ్లు భాస్కర్, విజయభాస్కర్, జగదీష్, సుబ్బరాయుడు, శ్రీను, హుస్సేనయ్యలను శాలువ,పూలమాలలతో సత్కరించారు. పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

పులివెందులకు రాత్రి బస్సు కోసం విచారణ

కొండాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) :పులివెందులకు కొండాపురం నుంచి రాత్రి 8 గంటల సమయంలో బస్సు నడిపేందుకు సాధ్యసాధ్యల కోసం పులివెందుల డిపో మేనేజరు రామకృష్ణ , ఆర్టీసీ సిబ్బంది కొండాపురంలో విచారించారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో కొండాపురం నుంచి పులివెందులకు వెళ్లడానికి కలెక్టర్‌కు అర్జీ ఇచ్చామని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. దీంతో డీపో మేనేజర్ స్థానిక ప్రజలను విచారించారు.

వర్షాలు పడుతున్నాయి.. ఆరోగ్యాలు జాగ్రత్త

- బాలికల గురుకుల పాఠశాల తనిఖీలో డీఎంహెచ్‌వో

కొండాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు బాగాపడుతున్నాయి.. ఆరోగ్యాల పట్ల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు సూచించారు. మండలంలోని చౌటిపల్లె వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థినులకు విషజ్వరాలు వస్తున్నాయని ఫిర్యాదులు అందడంతో ఆయన పాఠశాలను తనిఖీ చేసి పాఠశాల పరిసరాలను తనిఖీ చేశారు. తరగతిగదులు, వాటర్‌ప్లాంటు వంటగది, హాస్టల్ గదులను పరిశీలించారు. ప్రిన్సిపాల్, విద్యార్థులతో మాట్లాడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శానిటేషన్ గురించి అవగాహన కల్పించారు. పిల్లలకు జ్వరం వస్తే వెంటనే హాస్పిటల్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అదేవిధంగా తాళ్లప్రొద్దుటూరులో నిర్వహించిన మెడికల్‌క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవి, సిబ్బంది వెంకటరెడ్డి, లతా, కళ్యాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాగరాజు

ఓటర్ల జాబితా అవకతవకలపై సంతకాల సేకరణ

బద్వేలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా అవకతవకలపై జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమం చేపడుతున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో ఆమెమాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓటర్ల జాబితాలో జరిగిన అవకవతవకలపై ఈసీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పార్లమెంటు సమావేశాలలో ప్రధాని దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీంతో ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సంతకాల సేకరణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా సంతకాల సేకరణలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని కాంగ్రెస్‌పార్టీ నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులకు జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అచ్యుతరాజు, నరసింహ, బాష, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి

20 టన్నుల యూరియా మంజూరు

అట్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాలకు 20 టన్నుల యూరియా మంజూరైనట్లు శుక్రవారం వ్యవసాయాధికారి రామక్రిష్ణ తెలిపారు. మంజూరైన యూరియాను శుక్రవారం కుంభగిరి రైతు సేవాకేంద్రంలో 10 టన్నులు కమలకూరు రైతు సేవా కేంద్రంలో 10 టన్నులు యూరియాను రైతు సేవకేంద్రాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకున్న వారికే యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని ఏవో తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాల వద్దకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డుతో రావాలని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం అసిస్టెంటు రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఇల్లులేని వారికి పీఎంఏవై కింద రుణ సాయం

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇల్లులేని వారికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రుణం అందజేస్తుందని హౌసింగ్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం అర్బన్‌హౌసింగ్ డీఈ కార్యాలయంలో అంగీకార్ 2.0 కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ అంగీకార్ 2.0 కార్యక్రమం కిందకొత్తగా ఇల్లు మంజూరైన వారు, ఇల్లు పూర్తయిన వారు, ఇల్లు కట్టుకుంటున్నవారికి పీఎంఏవై పీఎం సూర్యఘర్, పీఎం స్వానిధి పథకాల గురించి అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతం లేఅవుట్‌లలో ఇల్లు నిర్మించుకునే వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా అందించే రూ.50 వేల ఆర్థిక సహాయం గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. పీఎం ఏవై కింద ఇల్లులేని వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు కార్యక్రమంలో హౌసింగ్ అర్బన్ డీఈ వెంకటసుబ్బయ్య, సీఎల్‌టీసీ రవి, ఎంఐఈలు రవికుమార్ జయనరసింహులు, డీఈవో దామోదర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాం

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలో రహదారుల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు రోడ్డు, హనుమాన్ జంక్షన్, ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డును ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులురెడ్డితో కలిసి పరిశీలించారు. వివిధ దశల్లో కొలతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధాన రహదారికి ఒకవైపు కాలువ పనులు ఇదివరకే ప్రారంభమయ్యాయని మరోవైపు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త బస్టాండు నుంచి హనుమాన్ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు మాట్లాడుతూ వాసవీ సర్కిల్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఇదివరకే రూ.5.30 కోట్ల నిధులతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి నాలుగు లైన్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సహకారంతో గ్రామ పంచాయతీ నిధులతో ప్రజలకు మరింత సౌకర్యం కలిగించే దిశగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.



రోడ్డుపై పడిన గుంతను పరిశీలిస్తున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి, ఈఈ

గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు రోడ్డు ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులలో పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆ రోడ్లపై ఉన్న గుంతలను వాహనదారుల ఇబ్బందులను వారు పరిశీలించారు. అనంతరం మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ ఈఈ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌చార్జి ఆయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు, అలాగే ఎర్రగుంట్ల బైపాస్ నుంచి వాసవీ సర్కిల్ వరకు రోడ్లు అధ్వాన్నంగా మారాయన్నారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ కార్యదర్శి రఫి, ముక్తియార్ పాల్గొన్నారు.

నీటి మునిగిన విద్యుత్ కార్యాలయాల పరిశీలన

ఎర్రగుంట్ల సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):ఎర్ర గుంట్ల మండలంలో కురిసిన వర్షాలకు నీటి మునిగిన విద్యుత్ కార్యాలయాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను శుక్రవారం జిల్లా విద్యుత్‌శాఖాధికారి రమణ పరిశీలించారు. అందులో భాగంగా నీటి మునిగిన ట్రాన్స్‌ఫార్మలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కార్యాలయాలను తాత్కాలిక గదులకు మార్చాలని ఆయన సూచించారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపాలని సివిల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ఏఈలు చంద్ర, హరి, జిలాని, సుమంత్,రామకృష్ణ పాల్గొన్నారు.

ఏపీలో కూడా కులగణన చేపట్టాలి

బద్వేలు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో మాదిరిగా మన ఏపీలో కూడా జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐఎంఎల్ జిల్లా స్టాండింగ్ కమిటి మెంబర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, శ్రమ శక్తితో సంపదను సృష్టించే వెనుకబడిన తరగతులను యంత్రాలుగా చూడడం తగదన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో అసెంబ్లీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుని జనగణనలో కులగణన చేసి జనాభా ప్రాతిపదికన ఎన్నికలలో సీట్లు కేటాయించాలని చూస్తుంటే కూటమి ప్రభుత్వం జనగణనలో కుల గణన చేయడానికి ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ నాయకులు చెన్నయ్య పాండు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.